భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు


గుంతకల్లులోని ఈద్గాలో సామూహిక ప్రార్థలు చేస్తున్న ముస్లింలు


యాడికిలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు


గుత్తిలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- కిటకిటలాడిన దర్గాలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శనివారం ముస్లింలు బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు బక్రీదు విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు. అలాగే పలువురు నాయకుల ఇళ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అతిథులను ఇళ్లకు ఆహ్వానించి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తాడిపత్రి రూరల్/తాడిపత్రి టౌన్: తాడిపత్రి పట్టణంలో శనివారం ముస్లింలు బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లింలు పట్టణంలోని పాత, కొత్త ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలుచేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌భాషా ఇళ్లకు పెద్ద సంఖ్యలో ముస్లింలు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

యాడికి: మండల కేంద్రంతో పాటు రాయలచెరువు, వేములపాడు గ్రామాల్లో ముస్లింలు మసీదు, ఈద్గాలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాల వద్ద యాడికి అప్ గ్రేడ్ పీఎస్ సీఐ ఈరన్న, ఎస్ఐ వెంకటరమణ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, చాగల్లు, పెద్దపప్పూరు, పెద్దయక్కలూరు, చీమలవాగుపల్లి, జూటూరు, నరసాపురం గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లతో పాటు మండల వ్యాప్తంగా శనివారం ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుత్తి ఆర్ఎస్‌లో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈద్గాలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు.

గుంతకల్లు: పట్టణంలోని ఈద్గా మైదానం, హజరత్ మస్తాన్‌వలి దర్గా తదితర ప్రాంత్రాల్లోని ఈద్గాలకు ముస్లింలు పెద్ద సంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా మైదానంలో మతపెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బక్రీద్ పండగ విశిష్టతను వివరించారు. పలువురు ముస్లింలు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిను ఆయన నివాసంలో కలిసి బక్రీద్ శుభాంకాక్షలు తెలిపి స్వీట్ అందజేశారు.

పామిడి: పామిడిలో శనివారం స్థానిక ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫేష్మామ్‌లు ప్రసంగించారు. రాగద్వేషాలను వదిలేసి మానవతను వ్యాప్తి చేయాలన్నదే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

శింగనమల: మండలంలోని శింగనమల, ఆకులేడు, లోలూరు, తరిమెల, సలకంచెరువు, పెరవలి గ్రామాల్లో ముస్లింలు శనివారం బక్రీదు పండుగను ఘనంగా నిర్వహించారు. శింగనమలలోని ముస్లింలు ఆసార కట్ట నుంచి ర్యాలీగా చెరువు వద్ద ఉన్న ఈద్గాకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు.

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెతో పాటు మర్తాడు, కల్లూరు, పెనకచెర్ల డ్యాం, యర్రగుం ట్ల, కమలాపురం, గ్రామాల్లో శనివారం ముస్లిం బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు.

యల్లనూరు: మండలంలోని ఎల్లనూరు, నిట్టూరు, పెద్దమల్లేపల్లి, తిమ్మంపల్లి, సింగవరం, ,కల్లూరు, తదితర గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ ప్రాముఖ్యతను మత గురువులు వివరించారు.


పెద్దపప్పూరు ఈద్గాలో ..


పామిడిలో ఈద్గా వద్ద..


గుత్తి ఆర్ఎస్ ఈద్గాలో ..


తాడిపత్రిలో ఫయాజ్‌బాషాకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు


తాడిపత్రిలో రమేష్‌రెడ్డికి స్వీట్ తినిపిస్తున్న ముస్లింలు


శింగనమలలోని ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు


గార్లదిన్నె మండలం కమలాపురంలో..

మార్కెట్‌లో దొంగలు పడ్డారు!

- రాత్రి సమయాల్లో పండ్ల దొంగతనం
- నష్టపోతున్న చిరు వ్యాపారులు


మార్కెట్ బయట పండ్లు, ఆకుకూరలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని దిన కూరగాయల మార్కెట్ ఆవరణలోని చిరు వ్యాపారులకు దొంగల భయం పట్టుకుంది. రాత్రి అయితే వివిధ రకాల పండ్లను దొంగలు ఎత్తుకెళుతున్నారు. వాచ్‌మెన్‌ను నియమించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో దొంగల పని సులువు అవుతోంది. మార్కెట్ ఆవరణలోని చిరు,గంప వ్యాపారులు పేదవారే. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. ఉదయం అప్పు తీసుకొని రాత్రికి పండ్లను విక్రయించగా వచ్చిన మొత్తంలో కొంత చెల్లించి మిగిలిన మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. వ్యాపారం ముగిసిన అనంతరం మిలిగిన పండ్లను భద్రపరచి ఇంటికి వెళుతున్నారు. ఈ పండ్లు దొంగతనానికి గురి కావడంతో.. తిరిగి పండ్లను అప్పు తెచ్చుకుంటూ అమ్మకాలు జరుపుకునే పరిస్థితి ఉంటోంది. విషయాన్ని పోలీసుల దృష్టికి బాధితులు తీసుకెళ్లకపోవడంతో దొంగలకు భయం లేకుండాపోతోంది.

కరువైన రక్షణ

మునిసిపల్ అధికారులు వ్యాపారులకు మార్కెట్‌లో స్టాల్స్ ఏర్పాటు చేయగా మార్కెట్ బయట ఇరువైపులా ఉన్న స్థలాన్ని చిరు, గంప వ్యాపారులకు కేటాయించారు. ఇక్కడ వ్యాపారులు కూరగాయాలు కాకుండా కేవలం పండ్లు, ఆకుకూరలు, పూలు తదితర వాటిని మాత్రమే విక్రయించాల్సి ఉంది. వీరికి ఎలాంటి షెడ్లు లేవు. ఎండ, వాన నుంచి తట్టుకునేందుకు తాత్కాలికంగా వ్యాపారులు పాథలిన్ కవర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎక్కువ మంది చిరు, గంప వ్యాపారులు వ్యాపార కార్యకలాపాల కోసం ఉదయం నుంచి రాత్రి వరకూ మార్కెట్‌లో ఉంటున్నారు.

వ్యాపారులను పీడిస్తున్న వడ్డీ వ్యాపారులు

చిరు, గంప వ్యాపారుల అవసరాలను ఆసరా చేసుకుంటున్న పలువురు వడ్డీల పేరుతో జలగల్లా పట్టి పీడిస్తున్నారు. కొందరు డైలీ కలెక్షన్ పేరుతో సాయంత్రం వచ్చి వడ్డీ వసూలు చేస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిరు, గంప వ్యాపారులకు రూ.10 వేల చొప్పున రుణ సాయం అందించేది. ఈ డబ్బు కొంత వరకూ వ్యాపారులకు ఉపశమనం కలిగించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రుణసాయం నిలిచిపోయింది. కుటుంబ అవసరాలు, వ్యాపారం కోసం తప్పనిసరిగా అక్రమ వడ్డీలకు డబ్బు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

దొంగలతో ఇబ్బంది



దొంగల వల్ల పండ్ల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నాం. రాత్రిసమయాల్లో పండ్ల దొంగతనం జరుగుతోంది. ఎవరు ఎత్తుకెళుతున్నారో తెలియడం లేదు. రాత్రి ఇంటికి వెళ్లి ఉదయం వచ్చి చూస్తే పండ్లు దొంగతనానికి గురవుతున్నాయి. – కవిత, చిరువ్యాపారి

తిరుమల పాదయాత్ర కరపత్రాల విడుదల

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయం, పాండురంగస్వామి ఆలయాల్లో శనివారం భావసార క్షత్రియ భజన మండలి ఆధ్వర్యంలో తిరుమల పాదయాత్ర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ భజన మండలి సభ్యులు మాట్లాడారు. మండల కేంద్రం నుంచి జూలై 17 నుంచి 29వ తేదీ వరకూ వరుసగా 12 రోజుల పాటు 500 మంది భక్త బృందంతో పాదయాత్ర చేస్తున్నామన్నారు. రెండు పూటలా భోజనం, కాఫీ, టీ, స్నాక్స్, అల్పాహారం, మంచినీరు అందిస్తామన్నారు. లగేజీకి ప్రత్యేక వాహన ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రి వేళ దేవాలయాలు సత్రాల్లో వసతి కల్పిస్తామన్నారు. శ్రీవారి మెట్ల వరకూ సౌకర్యాలు ఉంటాయన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిపత్రిటౌన్: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్‌లో శనివారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.21,530 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

చెరకు తోట దగ్ధం


కాలిపోయిన చెరకు తోట చూపుతున్న రైతు

పెద్దవడుగూరు: మండలంలోని మేడిమాకులపల్లెలో శనివారం రైతు కంబగిరికి చెందిన చెరకు తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పంట కాలిపోయింది. దీంతో రూ.4 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరాడు.

వ్యక్తిపై ఫిర్యాదు

తాడిపత్రిటౌన్: సమీప బంధువు, ధర్మవరం మండలం పోతులనాగేపల్లికి చెందిన వెంకటేష్ సెల్‌ఫోన్‌లో అసభ్యంగా తిట్టాడని పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన భాగ్యలక్ష్మి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త గంగాధర్‌కు వారి అన్నదమ్ములకు ఆస్తి గొడవలున్నాయని, ఆకారణంగా ఫోన్‌లో అసభ్యంగా తిట్టాడని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ సాయిప్రసాద్ కేసు నమోదు చేశారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

గుంతకల్లు: పట్టణంలోని ఆలూరు రోడ్డులో ఉన్న సాయిబాబా గుడి సమీపంలో శనివారం రాత్రి ఓ మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్ జరిగినట్లు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఆలూరు రోడ్డులో నివాసముంటున్న పుష్పావతి తన ఎనిమిదేళ్ల కుమార్తెతో పాటు మరో ఇద్దరు బంధువులతో కలిసి బళ్లారి రైల్వే గేట్ చౌరస్తాలోని విశాల్ మార్ట్‌కు శనివారం సాయంత్రం వెళ్లారు. షాపింగ్ అనంతరం ఆలూరు రోడ్డు తన కుమార్తెతో కలిసి వెళ్తున్న సమయంలో ద్విచక్రవాహనంలో హెల్మెట్ ధరించిన గుర్తు తెలియని దుండగుడు పుష్పావతి మెడలోని బంగారు మంగళ సూత్రం లాక్కుని పరారయ్యాడు. వెంటనే ఆమె భర్త గిరిబాబు (పాల వ్యాపారి)తో కలిసి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడు తులాల మంగళ సూత్రం చోరీకి గురయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. గత శుక్రవారం బుడబుక్కల కాలనీవాసులు, స్థానికులు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

ఆలయ భూములకు వేలం

వజ్రకరూరు: స్థానిక జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన భూములకు షీల్డ్ టెండర్–కమ్–బహిరంగ వేలం శనివారం నిర్వహించారు. సర్వేనంబర్ 122ఎలో మొత్తం 27.62 ఎకరాలకు వేలం నిర్వహించారు. వేలంలో రూ.93 వేల ఆదాయం వచ్చినట్లు ఆలయ సూపరింటెండెంట్ వెంకటేష్ తెలిపారు. ఈఓ వాణి, వ్యవస్థాపక ధర్మకర్త సుగుణమ్మ, దేవదాయశాఖ ఈఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


తాడిపత్రిలో ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


యాడికి ఎమ్మార్సీ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

తాడిపత్రిటౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్రశాఖ పిలుపు మేరకు శనివారం ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎస్జీటీల బదిల్లో మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, ఉపాధ్యాయుల అభ్యంతరాలను పరిశీలించిన పిమ్మట తుది జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బదిలీల్లో ఏర్పడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం ఎంఈఓ నాగరాజు కు వినతిప్రతం అందజేసారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు గంగాధర్‌రెడ్డి, కేశవనాయుడు, రవీంద్ర రాఘు రామయ్య ఓబయ్య, నారాయణరెడ్డి, రంగేశ్వరయ్య, రాజశేఖర్‌నాయరుడు, విశ్వనాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలను మాన్యువల్ ద్వారా చేపట్టాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాస యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులతో కలసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నబీరసూల్, జయరాం రెడ్డి, కృష్ణమూర్తి, షక్షావలి, నాగరాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.


గోతుల మయమైన తేరన్నపల్లి రోడ్డు

అడుగుకో గుంత..

తాడిపత్రిటౌన్: మండలంలోని తేరన్నపల్లి రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై అడుగుకో గోతి ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డుకు అనుసంధానంగా ఉండే తేరన్నపల్లి, ఎగువపల్లి, దిగుపపల్లి, తిమ్మాపురం గ్రామాలకు బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రజలు ఎక్కువగా ఆటోలపై ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన వారు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా గుంతలు కూడా పూడ్చడం లేదని చంద్రబాబు చెప్పిన అభివృద్ధి ఇదేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: బక్రీద్ పండగ సందర్భంగా పట్టణ రెడ్ డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించినట్లు రెడ్ డ్రాప్ ఫౌండర్ రెహమన్ తెలిపారు. పట్టణంలోని భాగ్యనగర్, పాత గుంతకల్లు, తిమ్మనచర్ల ఈద్గాలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాల్లో మతాలకు అతీతంగా ముస్లింలు, హిందువులు, క్రిస్టియన్లు స్వచ్ఛందగా రక్తదానం చేయడం విశేషం. ఈ మూడు శిబిరాల్లో దాదాపు 249 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ డ్రాప్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గులాం మహమ్మద్, షఫీ, ఉపాధ్యక్షుడు దివాకర్, నాయకులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోటార్ల కేబుల్ చోరీ


స్టార్టర్ పగులగొట్టి కేబుల్ చోరీ చేసిన దుండగులు

పెద్దపప్పూరు: మండలంలో మూడు రోజులుగా గుర్తుతెలియని దుండగులు పొలాల్లోని మోటార్ల వద్ద కేబుల్ చోరీ చేస్తుండడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. వివరాలు.. మండలంలోని చిక్కేపల్లి, నామనాంకపల్లి, షేక్‌పల్లి, శింగనగుట్టపల్లి తదితర గ్రామాలకు చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, చౌడప్ప, ఆది, కులశేఖర్ రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ఎంసీ రామాంజి, శ్రీకాంత్ రెడ్డి, నాగిరెడ్డి, జయచంద్రారెడ్డి, బోరు పుల్లారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, మోహన్‌రెడ్డి, సి.జయరామిరెడ్డి మరో 15 మందికి చెందిన మోటార్ల వద్ద ఉన్న కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా వరుస చోరీలు జరుగుతున్నాయని పోలీసులు నిఘా ఉంచి దొంగలను అరెస్టు చేసి కేబుల్ రికవరీ చేసి ఆదుకోవాలని రైతులు కోరారు. కేబుల్ చోరీలు మా దృష్టికి రాలేదని, బాధిత రైతులు ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


ధర్నా చేస్తున్న ఐద్వా సభ్యులు

గుత్తి: రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో శనివారం ఐద్వా సభ్యులు ధర్నా చేపట్టారు. ఐద్వా సభ్యులు రేణుక, నిర్మల ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. మైనర్ బాలికను అత్యాచారం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

పుట్లూరు: ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరించారు. 8వ తరగతి చదువుతున్న 53 మంది పరీక్షలు రాయగా ఉపకార వేతనానికి ఆరుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో వై.సాయిదీక్షిత, బి.సాయివైష్ణవి, పి.సుష్మశ్రీ, వి.పల్లవి, ఎం.లక్ష్మిప్రదీప్, కె.సాదిక్‌నవాజ్ ఉన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తాడిపత్రి ఏఎస్ఆర్ ఆస్పత్రి ఎండీ శ్రీనాథ రెడ్డి, గైనకాలజిస్ట్ అనూషరెడ్డి శనివారం తెలిపారు. శిబిరంలో గర్భిణులు, బాలింతలు, మహిళలకు పలు రకాల వైద్య సేవలు అందజేస్తామన్నారు. అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఈద్గాలో పాము కలకలం


ఈద్గాలో పాము ప్రవేశించిన దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఈద్గాలో శనివారం ఓ పాము కలకలం రేపింది. బక్రీద్ సందర్భంగా ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈద్గాలోకి పాము ప్రవేశించింది. పామును గమనించిన ముస్లింలు భయాందోళనకు గు'రరయ్యారు. కొందరు ధైర్యం చేసి పామును అదిలించి బయటకు పంపారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

కారును ఢీ కొన్న కంటైనర్


కారు ముందుభాగం దెబ్బతిన్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కంటైనర్ లారీ డ్రైవర్ రివర్స్ చేస్తూ వెనుక ఉన్న కారును ఢీ కొన్నాడు. ఘటనలో కారు డ్రైవర్ గాయపడ్డాడు. కారు ముందుర భాగం పాక్షికంగా దెబ్బనింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.